విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

గణపవరంలో 92 శాతం పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: వృద్ధులు, వికలాంగులు, వితం తువులకు అందించే పెన్షన్ గణపవరం నాలుగు సచివాల యాల్లో 92 శాతం పూర్తయి నట్లు పంచాయతీ కార్యదర్శి గ్రేడ్1 దార్ల శివరాం ప్రసాద్ గురువారం తెలిపారు. గణపవరం పట్టణంలో నాలుగు సచివాలయాల్లో మొత్తం పెన్షన్ దారులు 1798 మంది ఉండగా 1647 మందికి ఇచ్చామని ఇంకా 151 మందికి ఇవ్వవలసి ఉందని ఆయన తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం గ్రామ సచివాలయ సిబ్బందితో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు చేపట్టామని ఆయన తెలిపారు. ఇంటి నుండి బయటకు రాలేని వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే తీసుకెళ్లి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పరిరక్షణలో గణపవరం ఎంపీడీవో సూర్యనారాయణ పాల్గొన్నారని తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన గుడాల గోపి

విశాలాంధ్ర - పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, మట్టపర్రు గ్రామంలో గురువారం, వాలీబాల్ టోర్నమెంట్‌ను పాలకొల్లు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రారంభించారు. కాసేపు వాలీబాల్ ఆడారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడల పట్ల యువత ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అదే సమయంలో చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు కొల్లాబతుల రవిబాబు, నేలపాటి రత్న రాజు, సుధాకర్, సాయి, శ్రీను పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర - కలిదిండి : నవోదయ ప్రవేశ పరీక్షలలో విద్యార్థిని ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి పి.ప్రభాకర్ గురువారం తెలిపారు. కలిదిండి మండలం గురయిపాలెం గ్రామానికి చెందిన పోసిన జయదుర్గ నవోదయాలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు తెలిపారు. గురయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న జయదుర్గ నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష రాయగా నవోదయ ఫలితాలలో ఎంపిక అయిందన్నారు. తల్లితండ్రులు వెంకట భారతి ,అర్జునరావు, హెచ్ఎం బసవేశ్వర రావు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విశాలాంధ్ర-భీమవరం టౌన్: జిల్లాలోని ప్రతి ప్రైవేట్ క్లినికల్, నర్సింగ్ హోమ్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. గురువారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్‌లో భాగంగా వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు, ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, తప్పనిసరిగా ఆయుష్మాన్ భారత్ డిజిటలైజేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకారం హాస్పటల్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, మోడిఫికేషన్స్ ఐడీలు క్రియేట్ చేయించుకున్న వారికి మాత్రమే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టి.బి. లెప్రసీ, ఎయిడ్స్ ఆఫీసర్డా,బి. భాను నాయక్, డి.సి ఆరోగ్యశ్రీ,డా.కీర్తి కిరణ్, డిప్యూటీ డెమో,పి అనంతలక్ష్మి,డి హెచ్ ఈ.వి ఎస్ ఆర్ కె కుమారి, టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థుల్లో సృజ నాత్మకత ఆలోచనరేకెత్తించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో దోహదపడతాయని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నా రు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ టెక్నికల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఆయన గురువారం ప్రారం భించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన హార్డువేరు లైవ్ మోడల్స్ ను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.వీ.మురళి కృష్ణంరాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు నిరంతరం నూతన అన్వేషణలపై దృష్టి సారిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ పి రామ్మూర్తి రాజు, ఎం అనిల్ మాట్లాడుతూ చిన అమీరం, భీమవరం ఝాన్సీ లక్ష్మీబాయి ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు వచ్చి సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ ఎగ్జిబిషన్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కే.బ్రహ్మరాజు, డాక్టర్ వి.కె.విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలి: కొలుకులూరి

విశాలాంధ్ర - పాలకొల్లు: కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా ఆశీర్వదించాలని పాలకొల్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు అన్నారు. గురువారం పాలకొల్లు మండల పరిధిలోని పడమర పాలెం, వరిధనం ఎస్సి పేట ప్రాంతాలలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావుకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులు పట్టారు. పాలకొల్లు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ కొలుకులూరి అర్జునరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 8333 ప్రతినెల పేద కుటుంబాల వారికి అందడం వివరించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఒకటే మార్గమని ఆయన అన్నారు. పలువురు ముఖ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సుగుణమ్మ మృతి సీపీఐకి తీరనిలోటు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసిన ఆదోని ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త సుగుణమ్మ మృతి భారత కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటని సీపీఐ పోలవరం నియోజకవర్గం కార్యదర్శి కారం ధారయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడి కార్యకర్తలు ఎదుర్కొం టున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి కార్యకర్తలకు అండగా నిలిచిన ఘనత సుగుణమ్మదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అంగన్వాడి అసోసియేషన్ నిర్మాణం మొదటి 20 సంవత్సరాలు అలుపెరగని పోరాటాలలు చేసి సుగుణమ్మ ఉద్యమాలకు ఊపిరి పోసారని ధారయ్య కొనియాడారు. అనేక ఉద్యమాల్లో ముందుండే ఆమె, బుధవారం అనారోగ్యంతో మృతి చెందటం పార్టీకి తీరని లోటని ఆమె మృతికి సంతాపాన్ని తెలిపి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

విశాలాంధ్ర- ముసునూరు : సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతారని లోపూడి శివారు బస్వావరప్పాడు గ్రామానికి చెందిన ఎంపిటిసి వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోపూడి ,బస్వావరప్పాడు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి కొసులు పార్థసారథి ఆదేశాల మేరకు అయా గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సీక్స్ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పింఛన్ల పంపిణీకి తాత్సారమెందుకు..?

కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర - చాట్రాయి: పింఛన్ల పంపిణీకి తాత్సారం ఎందుకని.. అసలు డబ్బులు ఉన్నాయా లేవా..? రాజకీయాల కోసం వృద్ధుల ప్రాణాలు తీయకండి..? సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయించండి...? అంటూ తెలుగు దేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం మధ్యాహ్నం చాట్రాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మంగా కుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండే ఎండల్లో పింఛన్లు కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్న వయోవృద్ధుల ప్రాణాలు పోతున్నాయని ప్రతి సచివాలయంలోనూ ఉన్న సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ పింఛన్లు పంపిణీ చేయొద్దని చెప్పలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వలన నిండు ప్రాణాలు బలికుంటున్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలపై ఉద్దేశపూర్వకంగా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతూ తెలుగు దేశం పార్టీ పైన కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారించండి..

ఎండలు మండుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటి పోతున్నాయని గ్రామాలలో నీటి సమస్య ఉధృతం అవుతుందని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సప్లై చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, తెలుగుదేశం మండల మాజీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, కొత్తగూడెం మాజీ సర్పంచ్ చల్లగుండ్ల రాజారత్నం, సీనియర్ నాయకులు పుచ్చకాయ నోబెల్ రెడ్డి, పరసా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-తణుకు : వృద్ధులు, వికలాంగులు ఇతర లబ్ధిదారులకు పింఛన్లను ఇంటికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నియోజ కవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనతో రాష్ట్రం ఏ విధంగా అధోగతి పాలయింది అన్న విషయాన్ని తెలియజేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆరిమిల్లి ప్రచారా నికి అడుగడుగునా ప్రజలు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ పింఛన్లపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తూ కుట్రకు పాల్పడుతు న్నారని మండిపడ్డారు. వాలంటీర్ వ్యవస్థతో పింఛన్లు వద్దు అని మాత్రమే ఎన్నికల సంఘం చెప్పిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.26 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది పని చేస్తున్నారని ఆయన వివరించారు. సగటున ఒక్కో ఉద్యోగికి 45 మంది లబ్ధిదారులు ఉంటారని పేర్కొన్నారు. ప్రతిపక్షాల మీద బురద చల్లాలన్న దురుద్దేశంతో పింఛన్లను సచివాలయం నుంచే అందించే ప్రక్రియ చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా దారుణమైన ఎండలు నెలకొన్న పరిస్థితుల్లో వృద్ధులను, వికలాంగుల్ని ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. రాబోయే రోజుల్లో తమ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారం లోకి వచ్చినప్పటి నుంచి పింఛన్లను 4000 కు పెంచుతామని, ప్రతి ఇంటికి పింఛన్లు తీసుకెళ్ళి అందించేలా చర్యలు తీసుకుంటామని ఆరిమిల్లి రాధాకృష్ణ వివరించారు. వైసీపీ నేతల దుష్ప్రచారాలు నమ్మవద్దని కూటమిని గెలిపించాలని ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు.

ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తణుకు మున్సిపల్ మాజీ చైర్మన్ పరిమి వెంకన్న బాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి తామరపు రమణమ్మ, తామరపు సత్యనారాయణ, మదనపూడి రామకృష్ణ శివరాం, బోద్దని వెంకటేశ్వరరావు, కోళ్ల అనంతరావు, దేవరకొండ ఈశ్వరరావు, అలజంగి కుమారి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ సుబ్రా సాహెబ్, తణుకు పట్టణ కార్యదర్శి ఉమ్మి రాంబాబు కడియాల సూర్యనారాయణ, తణుకు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు చిక్కాల వేణు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల రిసెప్షన్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాల ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాటుల్లో భాగంగా గురువారం ఏలూరు లోని కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా ఎన్నికల సామాగ్రిని పంపిణీకి అవసరమైన స్టాల్స్‌ను, బస్సు రూట్లను, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కోర్టును, ఈవీఎంలను భద్రపరచు స్ట్రాంగ్ రూమ్‌లను వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, ఏలూరు డిఎస్పీ శ్రీనివాసరావు, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందునుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కళాశాల ఆవరణం అంతా పరిశుభ్రం చేయించి, లెవెలింగ్ పనులు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఇంటర్మీడియేట్ డిఇసి బి. ప్రభాకరరావు, తాహసిల్దార్ వి.మురార్జీ,మండల సర్వేయర్,ఇతర కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా పాయింట్ ప్రారంభం

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గాల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందించేందుకు ఈ మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అందిన ఫిర్యాదులను కలెక్టర్ వివరించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా, దానిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన దగ్గరనుంచి నేటివరకు వివిధ మార్గాల్లో వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సివిజిల్ ద్వారా, కాల్ సెంటర్‌కు, ఎన్‌జిఎస్‌పి పోర్టల్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.54.06 లక్షలు నగదు, రూ.8.28 లక్షలు విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్‌చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య, డిఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి టి.నాగేశ్వరరావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయల అధికారి కె.సి.హెచ్ అప్పారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సి.హెచ్.దుర్గ ప్రసాద్, ఎలక్షన్స్ డి.టి సన్యాసిరావు, ఇతర అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రజా గళం సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-నరసాపురం : ప్రజా గళం సభను విజయవంతం చేయాలని జోన్ -2 టీడీపీ ఇంచార్జ్ మందలపు రవికుమార్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో మాజీ శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్, నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం నిమిత్తం నరసాపురం నియోజకవర్గంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విచ్చేస్తున్నారన్నారు. పట్టణంలో స్టీమర్ రోడ్డులోని కనక దుర్గమ్మ ఆర్చ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. పింఛన్లు పంపిణీలో రాష్ట్రంలో నలుగురు మృతి చెందరన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు ఈ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నాలుగు గంటలకు స్టీమర్ రోడ్ లోని కనకదుర్గమ్మ ఆర్చి వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్న),పీవీఆర్, పొత్తూరి రామరాజు,బొమ్మిడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి నంబూరి ఆనందరావు సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : సీపీఐ పంగిడిగూడెం గ్రామ కమిటీ తరపున పార్టీకి నంబూరి ఆనందరావు చేసిన సేవలు ఎనలేనివని ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నంబూరి ఆనందరావు సంతాప సభ గురువారం పంగిడి గూడెంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ఆనందరావు తన వృద్ధాప్యంలో కూడా పార్టీకి సేవలందించారని ఎంతో మంది నిరుపేదల పక్షాన పోరాడిన ఘనత ఆనందరావుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు, సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణరాజు, ఉపాధ్యక్షుడు గొలిమే బాలఏసు, సీపీఐ పంగిడిగూడెం గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై జగన్ కొత్త నాటకం: కృష్ణ తులసి

విశాలాంధ్ర-తణుకు : నియోజకవర్గంలో మహిళా చైతన్యం వెల్లివిరుస్తోందని మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణ తులసి అభిప్రాయపడ్డారు. గురువారం తణుకు పట్టణంలోని 27వ వార్డు, పరిసర ప్రాంతాల్లో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి తరపున ఆమె ప్రచారాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈ ఎన్నికలు కీలకం కాబోతున్నాయని, ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఓటు వేయాలని ఆమె ఉదాహరణలతో సహా వివరించారు. కృష్ణ తులసి ఎన్నికల ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల మీద జగన్ రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని వెల్లడించారు. వాలంటీర్ వ్యవస్థని పక్కన పెట్టమని మాత్రమే ఎన్నికల సంఘం చెప్పిందని, సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపించే అవకాశం ఉందని ఆమె వివరించారు. కేవలం తెలుగుదేశం మీద బురద చల్లే ఉద్దేశంతోనే సచివాలయం దగ్గరికి లబ్ధిదారుల్ని పిలిపిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కుట్రలని తిప్పి కొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. తణుకు నియోజకవర్గంలో ప్రతి కాలనీకి ఆరిమిల్లి రాధాకృష్ణ గతంలో ఎంతో మేలు చేశారని ఆమె వివరించారు. ప్రతి చోట డ్రైనేజీ సమస్య తిష్ట వేసిందని దోమలతో రోగాలతో ప్రజలు బాధపడుతున్నారని ఆమె వివరించారు. పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని ఆమె పిలుపునిచ్చారు. కూటమికి ఓటు వేసి ఆరుమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, కొత్తలంక సుబ్రహ్మణ్యం, భీమనాథం వెంకట సుబ్బారావు, బొల్లాడ నాగరాజు, జై బాబు, గోపిశెట్టి చిన్న, బోర్ల రామారావు, సుబ్బారావు, ఎస్‌కె మన్సూర్, ప్రకాష్, పశ్చిమగోదావరి జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షులు గండి రామకృష్ణ, తణుకు మాజీ కౌన్సిలర్లు కొప్పొలి ఇందిరాదేవి,గండి వరలక్ష్మి, కొమ్మిరెడ్డి రమాదేవి,కాకిలేటి సత్యవాణి ,తణుకు రేవతి ,పితాని సత్య దేవి, రంగరాజు మధులత, బొల్లాడ ధనరాజు, గంట శ్రీదేవి కొండేటి విజయ కుమారి, తాతిన అనురాధ, తెలగ రెడ్డి లక్ష్మి, మరియు తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర - గణపవరం: మండలంలో దాదాపుగా 48,311 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఈ మొత్తం ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కూడా కొనుగోలు చేస్తామని పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం గణపవరం మండలం సిహెచ్ అగ్రహారం గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రైతు ధాన్యం విషయంలో ఎఫ్ఏయు ప్రమాణాలు పాటించేటప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరామ్ మాట్లాడుతూ మద్దతు ధర కంటే ఎక్కువ ధర వస్తే ధాన్యం బయటకు అమ్ముకోవచ్చు అంతేగాని మద్దతు ధర కంటే తక్కువ ఏ రైతు కూడా ధాన్యం అమ్ముకోవద్దని మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ సరోజని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళి కృష్ణ గణపవరం మండల రెవెన్యూ అధికారి వై రాంబాబు గణపవరం మండల వ్యవసాయధికారి యర్రం శెట్టి వెంకటసత్యనారాయణప్రసాద్ ఎం ఎల్ ఓ దేవదాస్ వి ఏ ఏ,టి ఎ, డిఇఓ లు రైతులు హాజరయ్యారు.

సంక్షోభంలో జీడి రైతు

దిగుబడులు లేక దిగాలు

ఎండిన పూత

విశాలాంధ్ర-లింగపాలెం : జీడి తోటలను నమ్ముకున్న రైతులు ఈ ఏడాది ఎదురైన ప్రతికూల పరిస్థితుల వల్ల అల్లాడుతు న్నారు. తరతరాలుగా జీడి మామిడి తోటలే ఆధారంగా జీవిస్తున్న రైతన్నలంతా నిరాశ చెందుతు న్నారు కుటుంబాలకు ఆధారంగా ఉన్న జీడి రైతులు ఈ ఏడాది దిగుబడులు రాకపోవటంతో దిగాలు చెందుతున్నారు. వీరికి ఉన్న జీడి తోటలను వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. ఈ తోటలపై వచ్చే ఆదాయంతో వారి కుటుంబాలు ఆర్థికంగా అవసరాలు తీర్చుకోవటం జరుగుతుంది. ఏలూరు జిల్లాలో దాదాపు 20వేల ఎకరాలలో జీడి తోటలు ఉన్నాయి. జీడి తోటలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ ప్రకృతి పరమైన ఇబ్బందులు తలెత్తడంతో రైతులంతా సంక్షోభంలో పడ్డారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో ఈ ఏడాది పూత రాలేదు. వచ్చిన పూత రాలిపోవటం జరిగింది. మచ్చుకైనా జీడి కాయలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఎకరాకి దాదాపు ఐదు కింటాళ్లు దిగుబడి రావలసి ఉండగా కేవలం 20 కిలోల మించి దిగుబడులు లేవు. ఎకరాకి దాదాపు రూ 18 వేలు పెట్టుబడి పెట్టారు. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఎదురైంది. ఎకరాకి దాదాపు రూ50 వేలు ఆదాయం రావాల్సి ఉండగా కనీసం వెయ్యి రూపాయలు కూడా రాని పరిస్థితి ఎదురైందని రైతన్నలు కుమిలిపోతున్నారు. ఈ ఏడాది వీరంతా అప్పులు పాలయ్యారు. మెట్ట ప్రాంతంలో జీడి తోటలు పండించే వారంతా చిన్న, సన్న కారు రైతులు. నీటి వనరులు లేకపోవటం వల్ల ఈ పంటను పండిస్తున్నారు. ప్రభుత్వ పరంగా చేయూత ఉన్న పకృతి పరంగా వచ్చే ఇబ్బందులు వల్ల నష్టాలు బారిన పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అంబులెన్స్‌లో చార్జీల పట్టిక తప్పనిసరి

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : జిల్లాలోని అన్ని అంబులెన్స్ వాహనాలలో చార్జీల పట్టిక తప్పనిసరిగా అతికించాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో అంబులెన్స్ ఓనర్స్‌తో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, పేషంట్ల నుండి అంబులెన్స్ డ్రైవర్లు అధికంగా వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లినందున, ఆయన ఆదేశాల మేరకు ప్రతి అంబులెన్స్ యజమానులు చార్జీల పట్టికను తప్పనిసరిగా వాహ నాల్లో ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి 300 మీటర్ల దూరంలో ప్రైవేట్ అంబులెన్స్ నిలపాలని, ఎవరైనా హాస్పటల్ సిబ్బంది ప్రైవేట్ అంబులెన్స్ సిబ్బందితో లాలూచీ పడి అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పని అన్నారు. డిసిహెచ్ఎస్ వారు గవర్నమెంట్ హాస్పి టల్ నందు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేస్తారని తెలియజేశారు. అలాగే మానిటరింగ్ సెల్ 8500814033, 9390411784, 9154294686 కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వొచ్చని, అలాగే వాట్స్ అప్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏంహెచ్ఓ డి.మహేశ్వరరావు, భీమవరం డిసిహెచ్ఎస్ పి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాగంటి కుటుంబాన్ని పరామర్శించిన సారథి

విశాలాంధ్ర - చాట్రాయి: 96 ఏళ్ల వయోవృద్ధురాలు చాగంటి అనసూయ మృతి చెందడంతో తెలుగుదేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన ఆమెకు ఆరుగురు కొడుకులు మనవళ్ళు మనవరాళ్ళు ఐక్యంగా ఉండాన్ని ఆయన కీర్తించారు. ఆమెకు మొత్తం ఆరుగురు కొడుకులు కాగా టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు కనీస వేతన మండలి సలహా కమిటీ మాజీ సభ్యులు చాగంటి నరసింహారావు, తెలుగు రైతు నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాగంటి బుచ్చిబాబు, సిపిఎం చాట్రాయి మండల సీనియర్ నాయకులు చాగంటి రాజారావులు వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. యర్రా కుటుంబానికి పరామర్శ పోలవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాద్ మనవరాలు లిఖిత మూడేళ్ళ వయస్సున్న చిన్నారి రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కాపా పరామర్శ నూజివీడు ఎఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు చాగంటి అనసూయ భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాడు బస్వారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, మాజీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, పోలవరం నాయకులు మరిడి చిన్నప్పారావు, ఎర్ర హేమంత్ కుమార్ చిన్నయ్య, శ్రీనివాసరావు, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం.. ఆశీర్వదించండి

కారుమూరి, దూలం నాగేశ్వరావు

విశాలాంధ్ర - కైకలూరు : కొల్లేరు ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు, ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ అన్నారు. ఆటపాకనందు గల వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ నివాసంలో కొల్లేరు ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగే శ్వరరావు, స్థానిక ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణల మాట్లాడుతూ కొల్లేరు ప్రజల స్థితిగతులను మార్చడానికి ఎన్నో ఉద్యమాలు చేసిన నాయకుడు సైదు గంగరాజును ఆదర్శంగా చేసుకుని, కొల్లేరు ప్రజలకు మరింత న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. కొల్లేరు ప్రజల్లో ఒకరైన జయ మంగళకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని, మన కొల్లేరు సమస్యలను మీ బిడ్డగా పార్లమెంట్ సాక్షిగా గళం వినిపించేందుకు బీసీ బిడ్డను, ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టిన మీ బిడ్డను అందరూ ఆదరించాలని, అదేవిధంగా ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వర రావు కొల్లేరుకు చేసిన అభివృద్ధి మీ కళ్ళముందే కనబడుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క కొల్లేరు బిడ్డ గ్రహించాలని తెలియజేస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లేరు పెద్దలు, నాయకులు,కొల్లేరు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆత్మస్థైరం నింపేందుకే పోలీసు కవాతు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఓటర్లలో ఆత్మ స్థైరాన్ని నింపేందుకే పోలీసుకవాతు లక్ష్యమని ఎస్సై డి.వెంకట్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చిగురికోట, వడాలి, వైవాక గ్రామాలలో సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో ముదినేపల్లి పోలీసులు రోడ్డు మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డి.ఎస్.పి శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ పర్యవేక్షణలో ఈ పోలీసుకవాతు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. కవాతు జరిగిన గ్రామాల్లో గ్రామస్తులు ఆసక్తిగా వీక్షించారు.

అట్టహాసంగా ముగిసిన సాంకేతికోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి గూడెం: శ్రీవాసవి ఇంజనీ రింగ్ కళాశాలలో గత రెండు రోజుల నుంచి జరుగు తున్న సాంకేతిక ఉత్సవం స్పెక్ట్రా 2కె24 యువతీ యువకుల సాంస్కృ తిక ప్రదర్శనల హోరుతో అట్టహా సంగా ముగిసింది. కళాశాల పాలక వర్గ అధ్యక్షులు గ్రంథి సత్యనారా యణ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన సాంకేతికోత్స వంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియ జేస్తున్నామన్నారు. సాంకేతికోత్సవంలో భాగంగా నిర్వహించిన అన్ని విభాగాలలో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో అదరగొట్టారని, ఇలాంటి ఉత్సవాలలో మీలోని సృజనాత్మకత బయట పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్ట్ లు అబ్బురపరచేలా ఉన్నాయని భవిష్యత్తులో అవి స్టార్టప్‌లుగా మారాలని కోరుకుంటున్నామన్నారు. డిగ్రీ చదువుకునే సమయంలో విద్యార్థులు ఏం నేర్చుకున్నారు అన్నదే మీ జీవితాలను ప్రభావితం చేస్తుందని గుర్తించాలన్నారు. టాలెంట్ బయట పెట్టడానికి అడ్డుపడే భయాన్ని, బిడియాన్ని విడిచి పెట్టగలిగినపుడే విజయం వైపు అడుగులు వేయగల మన్నారు. కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ సాంకేతికోత్స వంలో భాగంగా వివిధ విభాగాలలో విభాగాల వారిగాను,కళాశాల స్థాయిలోను పోటీలు నిర్వహించామని అన్ని విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన వాటికి బహుమతులను ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఫ్లాష్ మాబ్, ఫ్యాషన్ పెరేడ్ , సంగీత ప్రదర్శన, అబ్బుర పరిచే నృత్యాలతో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు హుషారుగా సాగి అందరినీ అలరించాయి. వీటితో పాటు పొట్టేళ్ళు సినిమా టీం కూడా తమ సినిమా ప్రమోషన్ కోసం విచ్చేసి విద్యార్థులతో కలసి సందడి చేసారు.

మానవత్వం చాటిన చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర -పెదపాడు: తాళ్లమూడి జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన ప్రమాదంలో రెండు కార్లు ఢీ కొన్నాయి. అదే సమయంలో గన్నవరం విమానాశ్రయం నుంచి దుగ్గిరాల వస్తున్న దెందు లూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రమాద పరిస్థితినీ చూసి తక్షణమే స్పందించారు. హైవే పెట్రోలింగ్ టీమ్ తో చర్చించి ఘటనా వివరాలు ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనలో స్వల్పంగా గాయపడిన పెదవేగి మండలం కవ్వగుంటకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సుగ్గసాని గంగయ్య సహా ఇతరులను పరామర్శించారు. తక్షణమే మెరుగైన సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని హైవే పెట్రోలింగ్ సిబ్బందికి చింతమనేని సూచించగా, గాయాలపాలైన వారిని హైవే అంబులెన్స్ పై ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటనను చూసి తక్షణమే స్పందించిన చింతమనేని ప్రభాకర్ కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల వద్దకే పింఛన్లు.. లబ్ధిదారులకు ఊరట

విశాలాంధ్ర - ముదినేపల్లి : సామాజిక పింఛన్ల పంపిణీలో వాలంటీర్లను తప్పించడం తో ఈ నెల పింఛన్ ఎలా అందుకోవాలన్న ఆందోళన వృద్ధులు, రోగులు, వికలాంగుల్లో నెలకొంది. మొదటి రెండు రోజులు ఉదయమే గ్రామ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. ఈ బాధ్యతను సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం అప్పగించిన సంగతి విధితమే. ఈ క్రమంలో తొలి రోజు పంపిణీ ప్రక్రియ ఆశాజనకంగా లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం 80 ఏండ్లు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇండ్ల వద్ద పింఛన్లు పంపిణీకి ఆదేశించడంతో వారికి ఊరట లభించింది.

ఆదివాసుల వాటా సాధనకే ఎన్నికల్లో పోటీ: మడకం

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : రాజ్యాధి కారంలో ఆదివాసుల వాటా సాధన కోసం ఎన్నికలలో పోటీ చేయనున్నట్లు పోలవరం నియోజకవర్గం గోండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థి మడకం వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం జీలుగుమిల్లి మండలం మడకం వారి గూడెం గ్రామంలో మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే జీవో నెంబర్ త్రీని అమలు అయ్యేలా చేస్తామని అన్నారు. పోడు భూములకు పట్టాలి ఇప్పిస్తామన్నారు. ఐటీడీఏ నిధులు అర్హులకు సక్రమంగా అమలు చేస్తామన్నారు. గిరిజనేతరులు గిరిజనులు పేరుమీద తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయుధ కర్మాగారం ఐదవ షెడ్యూలు ప్రాంతంలో చట్ట విరుద్ధంగా నిర్మించడం తగదు అన్నారు. ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తగిన సదుపాయాలు కల్పించే వరకు పోరాడతామని అన్నారు. గోండ్వానా దండకారణ్య పార్టీ తరపున తూర ఉదుతున్నా మనిషి గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పోలవరం, చింతలపూడి, పాడేరు, అరకు, కురపం ,పాలకొండ ,సాలూరు, పాతపట్నం మరియు అరకు ఎంపీ స్థానాలలో పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వగెల రామకృష్ణ, నాయకులు వాగేలా వెంకటేష్, కుంజా ప్రసాదు ,వంకా ప్రసాదు, బరగడ సీత ,యు నాగేశ్వరరావు, ఎం గోపాలకృష్ణ, పి వెంకటేష్, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ భీమవరం అభ్యర్థిగా శ్రీనివాసరాజు

విశాలాంధ్ర-భీమవరం : ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భీమవరం అసెంబ్లీ అభ్యర్థిగా దండు శ్రీనివాసరాజు పోటీ చేస్తారని పార్టీ జిల్లా కార్యదర్శి,లంక కృష్ణమూర్తి తెలి పారు. గురువారం ఆయన భీమవరంలో మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీతోను తమకు పొత్తుల్లేవని స్వతంత్రంగానే పోటీ చేస్తున్నామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, నేతాజీసుభాష్ చంద్ర బోస్ ఆశయాలకు కట్టుబడి పనిచేసే వారికి పార్టీ తరపున పోటిలో నిలుపుతామని, ఔత్సాహికులు 9949636885 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజల దాహార్తి తీర్చాలి: కమిషనర్

విశాలాంధ్ర-భీమవరం: ప్రజల దాహార్తి తీర్చడానికి మరింత మంది ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. శ్రీ అన్నపూర్ణా అన్నదాన ట్రస్టు సేవా సమితి అధ్వ ర్యంలో బుధవారం డైలీ మార్కెట్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న అన్నపూర్ణ ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి మరిన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించాలని మున్సిపాలిటీ తరపున తమ వంతు సాయమందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎం.త్రినాద్, డిఇ కె.అప్పలరాజు, చలివేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర -భీమవరం: తప్పనిసరిగా ఎన్నికల నియమావళి, నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య జనసేన పార్టీకి సూచించారు. గురువారం హెడ్ పోస్టాఫీసు వద్ద ప్రారంబించిన జన సేన ఎన్నికల శిబిరం వద్దకు ఎన్నికల సిబ్బందితో ఆమె వెళ్ళి శిబిరం అనుమ తులపై ప్రశ్నించారు. ఎక్కువ మంది గుమిగూడటానికి నిబంధనలు అంగీకరించ వని, శిబిరానికి అనుమతి తీసుకోవాలని, పోలింగ్ బూత్ నెం- 89కు జనసేన శిబిరం సమీపంలో ఉన్నందున పై స్థాయిలో అనుమతులు తీసుకోవాలని జన సేన నాయకులకు, శిబిరం నిర్వాహకులకు ఆమె స్పష్టం చేశారు. బృదంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ గౌరు, టిపిఒ శాస్త్రి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రైతు పండించే పంటల పైనే ప్రపంచంలో ఉన్న ప్రజలు జీవిస్తున్నారని, వ్యవసాయం అనేది ఎంతో ప్రాముఖ్యమైనదని స్థానిక స్వామి నాథన్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అగ్రికల్చర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏరువాక కోఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ వి నరసింహారావు, డాక్టర్ పి.అమ్మాజీ,ఆర్థిక శాస్త్ర నిపుణులు ఎస్ హైమా జ్యోతి పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో ప్రకాశం విద్యాసంస్థల ప్రాంగణంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల యాజమాన్యం అందజేస్తున్న వసతి సదుపాయాలు,విద్యార్థులతో ముఖాముఖి,విద్యార్థులుప్రత్యేకంగా పండించిన వ్యవసాయంలో వివిధ రకాల కూరగాయల పంటనుపరిశీలించి, వాటికి వచ్చిన తెగుళ్లను ఏ విధంగా నివారించాలి అనే అంశంపై సేంద్రియ వ్యవసాయం గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిహెచ్ నరసింహారావు యాజమాన్యం అందజేస్తున్న వసతులు సక్రమంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.జనార్దన్ రావు, చైర్మన్ గడ సుబ్బారావు, వివిఎస్ గాంధీ, హనుమాన్ చౌదరి, అధ్యాపకులు రేణుక, హారిక,ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: ఎన్నికలు నిబంధనలకు లోబడి కరపత్రాలు, వాల్ పోస్టర్లు ముద్రణ నిర్వహించాల్సి ఉందని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని ప్రింటర్లతో సమావేశమై ముద్రణ విషయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎన్నికల కరప త్రాలు, పోస్టర్లు మొదలైనవాటిని ముద్రించడం, ప్రచురించడం ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 127ఎ నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుం దన్నారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు మొదలైన వాటి ముద్రణ, పబ్లికేషన్‌కు సంబంధించి చట్టంలోని నిబంధనలను పాటించడం కంటే వాటి ఉల్లంఘనే ఎక్కువగా అనుసరిస్తున్నట్లు కమిషన్ గుర్తించిందన్నారు. ఎన్నికల సమయంలో, అటువంటి పత్రాలు పెద్ద సంఖ్యలో ప్రచురించబడతాయి, ప్రైవేట్, ప్రభుత్వ భవనాల గోడలపై అతికించబడతాయని, చట్టంలోని అంశాలను పాటించడం లేదన్నారు. సెక్షన్ 127ఎ నిబంధనలను, కమిషన్, ఆదేశాలను ఉల్లంఘిస్తే చాలా తీవ్రంగా పరిగణించబడుతుందని, చర్యలు తీసుకుంటామన్నారు. ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుందన్నారు. ప్రింట్ లైన్‌లో ఏదైనా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్‌ల ప్రింటర్, ప్రచురణకర్తల పేర్లు, చిరునామాలు, వారు ముద్రించిన ఇతర వస్తువులను స్పష్టంగా సూచించాలన్నారు. ప్రింటెడ్ మెటీరియల్ కాపీలు, ప్రచురణకర్త డిక్లరేషన్‌తో పాటు, దాని ముద్రించిన మూడు రోజులలోపు. అటువంటి ప్రింటెడ్ మెటీరియల్, డిక్లరేషన్‌తో పాటుగా, ప్రింటర్ దీనితో కమిషన్ సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన పత్రం కాపీల సంఖ్య అటు వంటి ప్రింటింగ్ పని కోసం వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందించాలన్నారు. జిల్లాలోని ప్రింటర్లు నిబంధనలను తప్పక పాటించా లని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సెక్షను సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ ఏం సన్యాసిరావు, ప్రింటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుయుక్తులు.. విసుగెత్తిన ప్రజలు

విశాలాంధ్ర - ఆచంట : ప్రజలంతా టీడీపీ కూటమి చేస్తున్న కుయుక్తులను ఛీదరించుకొంటున్నారని, వారికి ఓటమి భయం ఎన్నికల ముందే ప్రారంభమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఆచంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమమే శ్రీరామరక్షగా నిలుస్తుందని, ప్రతీ కుటుంబానికి సీఎం జగన్ మంచి చేసారన్నారు. దీంతో ప్రతీ కుటుంబం నుంచి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అంతేగాకుండా, ఆచంట నియోజకవర్గంలో అందించిన సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో వారి గుండెల్లో గుబులు రేపుతుందన్నారు. దీంతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీంతో నిత్య ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నించి విఫలమవుతున్నారన్నారు. ప్రజలందరికీ పాలుకు, నీరుకి తేడా తెలుసని, కమీషన్లకు కక్కుర్తి పడ్డవారేవరో ప్రజలకు తెలుసని,జన్మభూమి కమిటీలతో పేద ప్రజలను ఎవరు దోచేసారో ప్రజలకు తెలుసని. అయిదేళ్ల పాలనలో కార్యకర్తలు, ప్రజలందరూ పారదర్శకంగా ఉన్నారని అన్నారు .వలంటీరు వ్యవస్థతో పేదలకు పారదర్శకంగా సంక్షేమం అందిందని అన్నారు. వరదల్లోనూ, కోవిడ్ సమయంలోనూ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రతిపక్ష నాయకులు పారిపోయారన్నారు. కార్యకర్తలు అందరూ ఐక్యంగా ముందుకు సాగి సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బడుగు జీవులకు చేరువవుతున్న సారథి

విశాలాంధ్ర-చాట్రాయి: తెలుగుదేశం పార్టీ నూజివీడు నియోజకవర్గం అభ్యర్థి కొలుసు పార్థసారథి రోజు రోజుకు బడుగు బలహీన వర్గాల ప్రజల మనసులతో మమేకమవుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఉన్న జనాభా ప్రాతిపదికన తెదేపా మూడవసారి బలహీన వర్గాల సామాజిక తరగతికి చెందిన కొలుసు పార్థసారధికి అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని ఇచ్చిన విషయం తెలిసినదే. కొద్దిరోజుల క్రితం సారథి నూజివీడు వచ్చిన కొత్తలో కొన్ని శక్తులు వ్యూహాత్మకంగా సారది వ్యక్తిగత పని తీరుపై రకరకాల వదంతులను సృష్టించి ప్రచారం చేయించినా దానికి పూర్తి భిన్నంగా రోజురోజుకీ సారధి సామాన్య ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకుంటున్నారని పలువురు అంటున్నారు. గురువారం ఉదయం సారథి నరసింహారావుపాలెం పర్యటన చేసిన సందర్భంలో సమస్యలు చెబుతుంటే వ్యక్తిగత బాధ్యతతో అత్యంత శ్రద్ధగా వింటూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారని పలువురు అంటున్నారు. సమస్యలపై శ్రద్ధ కనబరిచి సారధి ఆసక్తిగా వింటుండడంతో గ్రామస్తులు స్మశాన వాటిక స్థలం గురించి, గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరైన, అసంపూర్తిగా ఉన్న ఇళ్లు చూపించడం, ఇళ్ళ స్థలాల సమస్యలను, తాగునీటి సమస్యలను సారధి దృష్టికి తీసుకురావడంతో వాటిపై స్పందించి తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో సారధి పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరం కలిసికట్టుగా వ్యక్తిగత బాధ్యతతో పని చేద్దామని, పార్టీ గెలిచిన తర్వాత ప్రతి సమస్యను పరిష్కారం చేసుకుందామని కార్యకర్తలు ప్రతిని బూనారు. తాగునీటి సమస్యపై చాట్రాయి ఎంపీడీవోకు సారది వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బసవరెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి,మాజీ అధ్యక్షులు చిట్టిబాబు, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, నరసింహారావు పాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు అందే కృష్ణ, మాజీ సర్పంచ్ మారేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో కన్నాపురం, దిప్పకాయలపాడు, పరింపుడి గ్రామాలకు చెందిన ఏడుగురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు.(కన్నాపురం) గోకవరపు.కోరేశ్, సొంగ. రాకేష్, సొంగ శ్రీను, గడ్డం చక్రధర్ రాజు,(గవరవరం), తగరం. వివేక్, (పరింపూడి) ఊసల. రాజేష్, (దిప్పకాయలపాడు) కురసం. మురళీకృష్ణ, లు రాజీనామా చేయడం జరిగిందని .వాలంటీర్ల వద్ద ఉన్న సెల్ ఫోన్లు, సిమ్ లు తమకు అందజేశారని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఉపాధి పనులతో లబ్ధి పొందాలి

విశాలాంధ్ర-లింగపాలెం: ఉపాధి పథకం ద్వారా వేతనదారులు 100 రోజుల పనులను పూర్తి చేసుకోవాలని పరిశీలన అధికారులు కోరారు. ఈ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకోవడం వల్ల వారు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రాయితీలు వస్తాయని అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెం ఉపాధి కార్యాలయంలో అంబుర్స్ పర్సన్ ఏ ఎం భాష, ఏపీవో వరలక్ష్మి సమీక్ష చేశారు. వేతన దారులకు సంబంధించిన విషయాలపై చర్చించారు. పని దినాలు పూర్తి చేసుకున్న వేతన దారుల కుటుంబాలలో 18 ఏళ్ళు వయసు దాటిన వారు ఉన్నట్లయితే వీరికి ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. దీనిపై వేతనదారులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. విద్యార్హతను బట్టి నైపుణ్యత పై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వేతన దారులకు ఎటువంటి సమస్య తలెత్తిన వాటిని తక్షణమే పరిష్కరించే చర్యలు తీసు కుంటున్నామని వీరు తెలిపారు. 20 24 ఏప్రిల్ నుంచి 20 25 ఏప్రిల్ వరకు మండలంలో 153 పనులు చేసేందుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది ప్రారంభించే పనులను ఈ నెల 8 నుంచి మొదలు పెడతామని తెలిపారు. ఎండలు అధికంగా ఉన్నందున పనులు చేసే సమయంలో వేతన దారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో తెలిపారు. రోజు వారి కూలి రూ 320 కి పెరిగిందని ఉపాధి వేతన దారుడు పనులకు రావాలని కోరారు.

544 అభ్యర్థనలకు అనుమతులు జారీ: కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్ధనలలో ఇంతవరకూ 544 అనుమతులు ఇవ్వటం జరిగిందని జిల్లా కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలక్టరేట్ లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యములో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటూన్నమన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా బుదవారం రాత్రి వరకు 816 అభ్యర్ధనలు రాగ వాటిలో ఇంతవరకూ 544 అనుమతులు జారీ చేయగా మరో 12 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 260 తిరస్కరించామన్నారు. సి-విజిల్ ద్వారా 247 ఫిర్యాదులు అందగా వాటిలో 150 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు మరో 97 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 78 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. యఫ్.యస్.టి, యస్.యస్.టి, పోలిస్ ఎన్ఫోర్స్మెంట్ ద్వారా చేబట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.135.39 లక్షల విలువైన నగదు,మద్యం,ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు.

ప్రశాంత భీమవరాన్ని సాధించుకుందాం: అంజిబాబు

విశాలాంధ్ర-భీమవరం: ప్రశాంత మైన వాతావరణంలో ఉన్న భీమవ రాన్ని సాధించుకుందామని, మంచి పరిపాలన రావాలంటే కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యమని రాజ్య సభ మాజీ సభ్యురాలు, టీడీపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం ఏడ్వర్డ్ ట్యాంక్ వద్ద జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి పార్టీ శిబిరాన్ని గురువారం టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి అభ్యర్ధులను గెలిపించుకుందామని, భీమవరంలో అందరికీ సుపరిచితుడు అంజిబాబు అని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని అన్నారు. జగన్ పాలనలో అంతా అరచకమే జరిగిందని, అందరికీ అనేక విధాలుగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేసిందని, ఇటువంటి సందర్భాల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా నిలబడ్డారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమని, జిల్లాలో అందరూ గెలుపు గుర్రలేనని అన్నారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు మాట్లాడుతూ ఐకమత్యంతో ఉంటే గెలుపు మనదేనని, గత పాలనలో తీవ్రంగా నష్ట పోయామని, రాష్ట్రంలో అభివృద్ధి లేదని, ఎక్కడ చూసినా అవినీతి, అరచకం, అన్ని మాఫియాలతో రాష్ట్రం కూరుకుపోయిందన్నారు. మళ్ళీ అభివృద్ధి కావాలంటే కూటమి విజయంతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి విజయం సాధిద్దామని అన్నారు. ఎంపి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని, కూటమి విజయానికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో ఇబ్బందులు చూసామని, పట్టుదలగా పని చేద్దామని అన్నారు. కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అంజిబాబు కుమారుడు పులపర్తి ప్రశాంత్, యిర్రింకి సూర్యారావు, బండి రమేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదునూరి సూర్యనారాయణ రాజు, మెరగాని నారాయణమ్మ, ఉండపల్లి రమేష్ నాయుడు, మంతెన కనక దుర్గ ప్రసాద్ రాజు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, మాజీ కౌన్సిలర్ పంతం సతీష్, కౌరు పృథ్వి శంకర్, రేవు వెంకన్న, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్

విశాలాంధ్ర-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలక్టరేట్‌లో అధికారులతో కలిసి ఎన్ఐసి రూపొందించిన సాఫ్ట్ వేర్ ఉపయోగిస్తూ ఆన్ లైన్ లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ గురువారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు తొలి ర్యాండమైజేషన్ లో పి ఓ,ఏపి ఓ ,ఓ పిఓ లకు విధుల కేటాయింపులో భాగంగా సంబంధిత నియోజకవర్గాల వారీగా శిక్షణ నిమిత్తం గుర్తించడం జరిగింది. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 1750 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 11,798 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అందులో 2,150 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2150 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7,498 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు.ప్రతి టీం లో ఒక పి.ఓ ,ఒక ఏ పి.ఓ ఇతర పోలింగ్ అధికారులు ఉంటారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టారు.ఈ కార్యక్రమములో జిల్లా జాయింట్ కలక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి, ఎన్ఐసి అధికారి శర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి సి అబ్రహం, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్ కె. ఖాజావలి ,జడ్పి సీఈఓ కె.సుబ్బారావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, కలక్టరేట్ ఏఓ కె.కాశి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద షిరిడి సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ వారి సౌజన్యంతో కొయ్యలగూడెం మండల మానవతా సంస్థకు మానవత వ్యవస్థాపకులు శ్రీ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో 80 వేల రూపాయల విలువగల ఫ్రీజర్ బాక్స్ ను మానవతా శాఖకు అందజేశారు. మానవతా శాఖ సంస్థ సభ్యులు ఫ్రీజర్ బాక్స్ అందజేసిన శిరిడి సాయి ఎలక్ట్రికల్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యధికారిణి టి. ఎస్తేరు రాణి, అబ్దుల్ తస్లీమా,సీతారామరాజు, మానవతా జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మానవత మండల శాఖ అధ్యక్షులు బొమ్మ మోహన్, తిర్నాతి సిద్దార్థ, రామకృష్ణ,ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, స్వామి నక్క బాబి,త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు భారీ కార్ల ర్యాలీ

విశాలాంధ్ర-ఏలూరు: బీజేపీ కార్యకర్తలలో ఉత్తేజం నింపటానికి ఈనెల ఆరో తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టిసీమ నుండి కైకలూరు వరకు భారీ కార్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బిజెపి ఏలూరు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, నియోజవర్గ కన్వీనర్లుతో జరిగిన సమావేశంలో నిర్ణయించిన మేరకు పోలవరం, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, కైకలూరు నియోజకవర్గల పరిధిలో ర్యాలీ నిర్వహించి మార్గమధ్యలో ఐదు ప్రాంతాల్లో బిజెపి జండా స్థూపాన్ని ఆవిష్కరిస్తామన్నారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, జిల్లా ఇంచార్జ్ సరేంద్ర ప్రకాష్, పార్లమెంట్ కన్వీనర్ కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తోపాటు నియోజవర్గ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, మండలాధ్యక్షులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని చౌటపల్లి విక్రమ్ కిషోర్ తెలిపారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు నగరపాటి సత్యనారాయణ, నడపన ధాన భాస్కర్, ఉంగుటూరు నియోజవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, ఏలూరు అసెంబ్లీ గాది రాంబాబు, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య పాల్గొన్నారు.

ఫిర్యాదుపై అధికారి వివరణ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరులో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపధ్యంలో శిలాఫలకాలపై ప్రజా ప్రతినిధుల పేర్లు కనిపించకుండా మూసివేసిన వస్త్రాలు జారిపోతున్నాయనే వచ్చిన ఫిర్యాదుపై ఏలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. ముక్కంటి వివరణ ఇచ్చారు. ఏలూరులో ఎన్నికల నియమావళి ప్రకారం శిలాఫలకాల్లో ప్రజా ప్రతినిధుల పేర్లు కనిపించకుండా పకడ్బందీగా వస్త్రాలను కట్టడం జరిగిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ నీటి వినియోగంపై చర్యలు

విశాలాంధ్ర-ఏలూరు: ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం నీరు విడుదలవుతున్న దృష్ట్యా తాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇతర అవసరాలకు అక్రమ నీటి వినియోగాన్ని నివారించడానికి జిల్లా, డివిజనల్, మండల, గ్రామ సచివాలయ స్థాయి బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. హీట్ వేవ్ సీజన్ దృష్టిలో వుంచుకుని ప్రజల భద్రత,ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని ఈ ఉత్తర్వులు జారీ చేసారు. మంచినీటి కాలువల నుంచి ప్రైవేటు చేపల, రొయ్యల చెరువులకు అక్రమంగా నీటిని వినియోగిం చకుండా పర్యవేక్షణకు ఈ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో డిఆర్ఓ చైర్మన్‌గా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, అదనపు ఎస్పి ,మత్స్య శాఖ జెడి ,జిల్లా పంచాయతీ అధికారి, ఇరిగేషన్ ఎస్ఈలతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేయగా డివిజన్ స్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఈ,ఆర్డిఓ ,డి.ఎస్.పి, ఇరిగేషన్ డిఈ, మత్స్య శాఖ ఏడి, డిఎల్డిఓలను నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ, తహసిల్దార్, ఎస్‌హెచ్ఓ, ఇరిగేషన్ ఏఈ ఈ బృందంలో వుంటారు. గ్రామస్థాయిలో పంచాయతీ సెక్రెటరీ ఆధ్వ ర్యంలో వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, గ్రామ మత్స్య అసిస్టెంట్ ఉంటారు.

దళిత వాడల్లో మౌలిక వసతులు: పులపర్తి

విశాలాంధ్ర-భీమవరం: పట్టణంలోని రాజ్ ట్రస్టు వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ అధ్వర్యంలో 11, 12 వార్డులకు చెందిన మహిళలు భీమవరం అసెంబ్లీ జనసేన అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులకు తమ సంఘీభావం తెలిపారు. గురువారం హెడ్ పోస్టాఫీసు వద్ద జనసేన ఎన్నికల శిబిరం ప్రారంభం సందర్భంగా గంటా రాజ్ కుమార్ మాజీ ఎమ్మెల్యేను కలిసి దళిత క్రైస్తవులు, దళితులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పులపర్తి స్పందిస్తూ దళిత వాడల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కట్టుబడి ఉంటానని, వారి స్వావలంబనకు తమ కూటమి ప్రభుత్వంలో తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్ ట్రస్టు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవస్థాన ప్రతిష్ఠా మహోత్సవంలో ఎంపీ

విశాలాంధ్ర-ముసునూరు: సంప్ర దాయ,సంస్కృతి కార్యక్రమాలకు నిలువుటద్దం దేవాలయాలు నిర్మించడమేనని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గుడిపాడు గ్రామంలో శ్రీ పాండువుల సమేత శ్రీ కృష్ణ దేవస్థాన ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పంచ పాండువులు విగ్రహాలు ప్రతిష్టించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదేవిధంగా నూజీవీడు నియోజక వర్గం టిడిపి ఉమ్మడి పార్టీల అభ్యర్థి కొలుసు పార్ధసారథి తనయుడు నితిష్ యాదవ్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సేక్రటరీ గద్దే రఘుబాబు, జిల్లా అధ్యక్షులు కొల్లి గంగారామ్, మండలపు ధర్మారాజు మండలపు బుజ్జియ్య పాల్గొన్నారు.

పెద్ద సైజు బ్యానర్ తొలగింపు

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: నూజివీడులో తెలుగుదేశం పార్టీ తాత్కాలిక కార్యాలయంలో అనుమతించిన పరిమాణంకు మించి పెద్దసైజు బ్యానర్ ఏర్పాటు చేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా భావించి ఈ కార్యాలయం ద్వారా గతంలో అనుమతిస్తూ జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేస్తూ నూజివీడు ఆర్డిఓ వై.భవానీశంకరి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వారు ధరఖాస్తుచేసిన దానిలో బ్యానర్ పై పేర్కొన్న కొలతలకంటే ఎక్కువగా ప్రదర్శించబడింది. ఈ దృష్ట్యా మున్సిపల్ అధికారులు, పోలీసుల సహాయంతో సదరు పెద్దసైజు బ్యానర్‌ను తొలగింపుచేయడం జరిగింది.

గ్రామాల్లో ఎన్డీఏ కూటమి విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-మండవల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండవల్లి మండలం పులపర్రు గ్రామంలో గురువారం ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు.తర్వాత ఇంటింటి ప్రచారంలో ఎన్డీఏ కూటమిలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాసరావు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ వారి కరపత్రాలు పంచుతూ కూటమి అభ్యర్థులు ప్రచార జోరు పెంచారు. ఊరూరా తిరుగుతూ, ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. తెలుగుదేశం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తూ, జగన్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించి చెబుతున్నారు. కార్యక్రమంలో సజ్జ బాబి, అట్లూరి భవాని ప్రసాద్,గజ్జల గణేష్, మోరు రవీంద్ర,గాలి ప్రసాదు, నాగనబోయిన పవన్ కుమార్,జి.గణేష్,తలారి రాజేష్,వీరవల్లి శివయ్య, ఘంటసాల తులసి,ముంగర ఏసు రాజు,కాట్రగడ్డ శంకరరావు,జయమంగళ నాగేశ్వరావు,అట్లూరి రాజేషు, వెంకన్న,గోల్కొండ చంద్రశేఖర్, ఇజ్జినేని అజాద్, నల్లిబోయిన రాజేష్, సత్తిబాబు,గుంటూరు సత్యనారాయణ, సత్యనారాయణ,గడిదేసి విజయ్ కుమార్, పులపర్రు గ్రామ పెద్దలు, తెలుగుదేశం, జనసేన,బిజెపి ఉమ్మడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ వేగంతో టిప్పర్లు హల్‌చల్

విశాలాంధ్ర - ముదినేపల్లి : మట్టి లోడుతో టిప్పర్లు హల్ చల్ చేస్తున్నాయి. మెరుపు వేగంతోవెళుతున్న మట్టి లోడుపై ఎటువంటి టార్పాలిన్ వేయక పోవడంతో గాలికి ఎగురుతున్న మట్టి వెనుక వస్తున్న వాహనదారుల కళ్ళు పూడుకుని పలుసార్లు తృటిలో ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం మొదలుకొని రాత్రి సమయాల్లో కోరుకొల్లు , సింగరాయపాలెం, ముదినేపల్లి , గుడివాడ-కైకలూరు తదితర రూట్లలో మట్టి టిప్పర్లు మెరుపు వేగంతో పలు ప్రాంతాలకు వెళుతున్నాయి. చెక్ పోస్టుల్లో తనిఖీలు ఎంతవరకు ఉందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి తనిఖీలు లేకపోవడంపై ఈ వేగానికి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని సర్వత్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మట్టి లోడ్ పై ఎటువంటి టార్పాలిన్ లేకపోవడంపై స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి టిప్పర్ల వాహనదారులు టార్పాలిన్ వేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఏడున్నర గంటలకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవాలలో భాగంగా గురువారం విఘ్నేశ్వర పూజ ప్రత్యేక హెూమాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ట తో పాటుగా శ్రీ మల్లికార్జున స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలతో పాటుగా ధ్వజస్తంభం ఆలయ శిఖర ప్రతిష్టాపనలు, అదేవిధంగా బలిపీఠ, యంత్రబింబ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానందశర్మ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు ఆరవ తేదీ అమ్మవారికి పసుపు కుంకుమలు పెట్టుకోవాల్సిందిగా పురోహితులు సూచించారు.

తనిఖీల్లో రూ.3.4లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర-ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న క్రమంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్ కె.ఖాజావలి వెల్లడించారు. గురువారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం,భీమడోలులో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ జరిపిన తనిఖీల్లో రూ.3,40,500 నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. భీమడోలులో రూ.2 లక్షలు,గణపవరం రూ.1,40,500 స్వాధీన పరచుకున్నారన్నారు. సదరు నగదును స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించారన్నారు. నగదు తీసుకు వెళ్ళే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్ పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర - రాజానగరం : తమ వర్సిటీకి చెందిన విద్యా మూర్తులు స్వయంగా రచించిన నూతన పుస్తకాలు విద్యార్థుల అభ్యుదయానికి దహదపడతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మ రాజు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం నందు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుబ్బారావు డాక్టర్ కొయ్యలమూడి రాధ రచించిన ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ పుస్తకాలను ఉపకులపతి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రంధకర్త డాక్టర్ సుబ్బారావును అభినందించారు. రచయిత డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు సర్దుబాటు వ్యాకులత, వార్షిక ప్రగతి ఏ విధంగా ఉంటుందో వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య జి సుధాకర్, అకాడమిక్ డీన్ ఆచార్య పి సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్టీఎస్‌లో 'పారిజాతపర్వం' చిత్రబృందం సందడి

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగు చలనచిత్రాలు విడుదలై విజయం సాధించాలంటే ఆ కళాశాలలో అడుగు పెడితే హిట్ అనే నానుడి చిత్ర పరిశ్రమలో చోటుచేసుకొంది. దీంతో ఏ సినిమా బృందమైన ఆ కళాశాలకు రావాల్సిందే విద్యార్థులతో యాజమాన్యం తో తమ సినిమా అనుభవాలు పంచుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో వనమాలి క్రియేషన్స్ లో కంభంపాటి సంతోష్ దర్శకత్వం వహించిన పారిజాత పర్వం అనే మూవీ ప్రమోషన్ కోసం తాజాగా మండలంలోని ఐఎస్టిఎస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో చిత్ర బృందం సందడి చేశారు. విద్యార్థులతో కాసేపు క్రీడా ప్రాగణంలో క్రికెట్ ఆడి అందర్నీ ఆకట్టుకున్నారు. దీనిలో భాగంగా చిత్ర హీరో చైతన్య రావు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లింగ్ తో కిడ్నప్ కథ నేపథ్యంలో అందరిని అలరించే విధంగా తమ సినిమా ఉంటుందన్నారు. హీరోయిన్ శ్రద్ధ దాస్ మాట్లాడుతూ ఐఎస్టిఎస్ కళాశాల కి రావడం ఆనందంగా ఉందని, అలాగే గోదావరి అందాలు మనస్సుకి అత్తుకున్నయని చెప్పారు.తమ ఏప్రిల్ 19న ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా విడుదలవుతుందని, కుటుంబ సభ్యులతో చూసే కథ అని,కనుక థియేటర్ లో సినిమా చూడాలని కోరారు. అనంతరం సినిమాలో పాటలకు డాన్స్ వేయడంతో పాటు డైలాగ్స్ చెప్పారు.దీంతో విద్యార్థులు చిత్ర బృందంతో సెల్ఫీలు దిగారు.తొలుత చిత్ర బృందానికి కళాశాల చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ సూరి బాబు మరియు ఏవో ఇక్బాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - కాట్రేనికోన : అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అమలాపురం ఎస్సీబీ స్వాడ్ అధికారులు అదుపులోకి తీసుకుని వారి నుండి 323 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ముమ్మిడివరం ఎస్ఈబి సిఐ డి రామారావు తెలిపారు. కాట్రేనికోన మండలం కందికుప్ప ప్రభుత్వం మద్యం షాప్ నుండి కందికుప్పకు చెందిన పిసపోతు ధర్మారావు, దొంతికుర్రుకు చెందిన కొమ్మాబత్తుల బాబాసాహెబ్ అంబేద్కర్‌లు 323 మద్యం సీసాలను పల్లం తంలిస్తుండగా ఎస్సీబీ అధికారులు బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. అయితే ఆ మద్యం సీసాలను కందికుప్ప ప్రభుత్వ మద్యం షాపులో సూపర్వైజర్‌గా పని చేస్తున్న పల్లంకుర్రుకు చెందిన నాతి కవిరాజు ఇచ్చినట్లు నిందితులు తెలపడంతో వారి ముగ్గురిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలు స్వాధీనం సీజ్ చేసి నిందితులను కోర్టుకు తరలించినట్లు సీఐ రామారావు తెలిపారు. ప్రభుత్వ మద్యం షాపులో సూపర్వైజర్‌గా పని చేస్తున్న కవిరాజు పై చర్యలకు ఎక్సైజ్ డిపో మేనేజర్‌కు నివేదించినట్లు సిఐ తెలిపారు. అయితే ఈ కేసు నుండి కవిరాజును తప్పించేందుకు అధికార పార్టీకి చెందిన ఉన్నత స్థాయి ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతో కొందరుఎన్నికలు ఆర్ఓకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌సిబి అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఎంపీడీఓ ఉషారాణి

విశాలాంధ్ర - పెద్దాపురం : మండలంలోని లబ్దిదారులకు రెండు రోజుల పాటు ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ చేయడ జరిగిందని పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి ఉషారాణి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ అన్ని పంచాయతీల వద్ద పింఛన్ల పంపిణీకి సంబంధించి లబ్దిదారులకు ఇబ్బందులు లేకుండా. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండవ రోజుకు సుమారు 80 శాతం పంపిణీ ప్రక్రియ పూర్తియ్యిందన్నారు. మండలంలో సుమారు 11962 మంది లబ్దిదారులకు గాను రెండు రోజులకు 9646 మందికి పింఛన్లు అందజేయడం జరిగిందని ఎంపీడీఓ ఉషారాణి తెలిపారు. కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో కొంత మంది లబ్దిదారులకు ఆమె చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

గండి స్వామి ప్రసాద్‌కు అభ్యుదయ రచయితల సంఘం అవార్డు

విశాలాంధ్ర - మండపేట : మండపేట పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు గండి స్వామి ప్రసాద్ తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం స్వాతంత్ర సమరయోధుడు శతాధిక గ్రంథకర్త పడాల రామారావు స్మారక పురస్కారంను అందజేసింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన అరసం సమావేశంలో అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్ ఈ అవార్డు ప్రసాద్‌కు అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా అరసం గౌరవ అధ్యక్షులు ప్రముఖ వైద్యులు కర్రి రామారెడ్డి అధ్యక్షులు, పడాల వీరభద్రరావు, కార్యదర్శి బివి రమాదేవి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పి గంగిరెడ్డిలచే స్వామి ప్రసాద్ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్‌ను నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి కేవివి సత్యనారాయణ, సాహితీ మిత్రులు కన్వీనర్ డాక్టర్ కే నాగ సత్యనారాయణ, గైట్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మీరా, తెలుగు పండితులు శ్రీనివాస్, డాక్టర్ మద్దుకూరి సత్యనారాయణ, సాహితీ ప్రియులు నల్లమామిడి మీరా సాహెబ్, ద్వారపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవితాల సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

దాతృత్వాన్ని చాటుకున్న హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ తమ దాతృత్వాన్ని చాటు కుంటుంది. గురువారం మండలంలోని దొండపూడి గ్రామంలో పదోతరగతి చదివే అమ్మాయి గంటాడ శివాని షుగర్ వ్యాధి వల్ల బాడీ ఇన్ఫెక్షన్ అయ్యి వైద్యం చేయించు కోలేని స్థితిలో ఉన్న ఆమె కుటుంబందొండపూడి హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సంస్థను సంప్రదించింది. గ్రూప్ సభ్యులందరూ తమ కష్టార్జితం నుండి రూ.15,000 రూపాయలు సహాయం చేశారు. మరియు సాగిపాడు గ్రామానికి చెందిన సిరా శిరీష అనే ఆమెకు థైరాయిడ్ సమస్య, ప్లేట్లెట్స్ పడిపోవడం వల్ల వారు కూడా హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సంస్థను సంప్రదించారు. వారికి కూడా గ్రూప్ సభ్యులందరూ డబ్బులు పోగుచేసి రూ.15000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నున్నా అనంత మణి కుమార్,మారాజు రాజేష్, వెల్లంకి జయశివసూర్యం, మల్లిపూడి శ్రీనివాస్,షేక్ హుస్సేన్, ముప్పిడి దివ్య పాల్గొన్నారు.

అత్యధిక రిజిస్ట్రేషన్లను నమోదు చేసిన ఓలా ఎలక్ట్రిక్

విశాలాంధ్ర - కాకినాడ : మార్చి నెలలో 53,000 రిజిస్ట్రేషన్‌లను (వాహన్ పోర్టల్ ప్రకారం) నమోదు చేసినట్లు ఓలా ఎలక్ట్రిక్ సంస్థ ప్రతి నిధులు ప్రకటనలో తెలిపారు. దీంతో, ఓలా ఎలక్ట్రిక్ వరుసగా ఐదవ నెలలో కూడా అత్యధిక నెలవారీ రిజిస్ట్రేషన్‌లను నమోదు చేసుకోవడంతో పాటు మార్కెట్ వాటాలో తమ ప్రథమ స్థానాన్ని కొనసాగించిందన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 1,52,741 యూనిట్ల నుండి 2024 ఆర్థిక సంవ త్సరంలో 328,785 యూనిట్లతో కంపెనీ 115 శాతం వృద్ధిని సాధించిం దన్నారు. గత త్రైమాసికంలో 84,133 యూనిట్లతో పోలిస్తే 4% 24లో 119,310 యూనిట్లతో త్రైమాసికం ప్రాతిపదికన 42 శాతం వృద్ధి నమోదు చేసుకుందన్నారు. ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మార్కె టింగ్ ఆఫీసర్ అన్షుల్ ఖండేల్వాల్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం పొడవునా మేము అమ్మకాలు మార్కెట్ వాటా రెండింటిలో సుస్థిరమైన వృద్ధిని నమోదు చేస్తూ మార్కెట్ లీడర్‌గా కొనసాగామన్నారు. ఓలా ఎలక్ట్రిక్ ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా మొత్తం తమ వాహన శ్రేణి పై 8-సంవ త్సరాలు / 80,000 కి.మీ. వరకు ఎక్స్టెండెడ్ బాటరీ వారంటీని కూడా ప్రారంభించిందన్నారు. ఈవీ స్వీకరణకు ఉన్న అడ్డంకులలో ఒకదానిని ఎలక్ట్రిక్ వాహనాల జీవితకాలం పొడిగించడం ద్వారా ఓలా పరిష్కరిస్తోందన్నారు. కస్టమర్‌లు ఇప్పుడు యాడ్-ఆన్ వారంటీని కూడా ఎంచుకోవచ్చనీ తెలియాజేశారు. ఇది రూ. 29,999 వద్ద కొనుగోలు చేయడానికి అందు బాటులో ఉందనీ, కంపెనీ తన సేవా నెట్‌వర్క్ ను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నంలో భాగంగా మార్చి 19న ప్రయాగ్‌రాజ్‌లో తన 450వ సేవా కేంద్రాన్ని కూడా ప్రారంభించిందనీ వివారించారు.

జీ తెలుగులో టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ సందడి చేసిన 'ఫ్యామిలీ స్టార్‌తో ఉగాది'

విశాలాంధ్ర- తూర్పు గోదావరి: జీ తెలుగు ఈ ఉగాదికి మరో అదిరి పోయే కార్యక్రమంతో వచ్చేస్తోంది. టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ ముఖ్యఅతిథిగా తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండగ ఉత్సవం ఫ్యామి లీ స్టార్‌తో ఉగాది ఉమ్మడి కుటుంబం ఈ నెల 7వ తేదీనసాయంత్రం 6 గంటలకు, మీజీ తెలుగులో ప్రసారమవుతున్న దని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరాది ఉగాది పండగని జీ తెలుగు నటీనటులందరూ ఘనంగా జరుపుకున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. జీ తెలుగు తారలతో కలిసి విజయ్ చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. ఇక డ్రామా జూనియర్స్ పిల్లలు విజయ్ దేవరకొండకోసం ప్రత్యేకంగా చేసిన స్కిట్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందన్నారు. సరదాలతో సంబరంగాసాగే ఈ కార్యక్రమంలో విజయ్ తాజా చిత్రం ఫ్యామిలీ స్టార్ ట్రైలర్ ను ప్రదర్శిం చారు. జీతెలుగు నటీనటులు, ప్రముఖ సినీతారలతో సందడిగా సాగిన ఈ కార్యక్రమంలో తదనంతరం, ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకి ప్రేక్షకులని అలరిస్తున్న సూపర్‌జోడి ఈవారం మృణాల్ ఠాకూర్ రాకతో జోడీలు మరిం త జోష్ పెంచారు. ఆటలు, పాటలు, అల్లరి, అద్భుత ప్రదర్శనలు, సరదా లతో సాగిన ఈఉగాది ప్రత్యేక కార్యక్రమాలని మీరూ తప్పకవీక్షించాలన్నారు.

సరికొత్త అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

విశాలాంధ్ర - రాజమండ్రి : టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీ కే ఎం) విడుదల చేసింది. ఎ -ఎస్ యువీ విభాగంలోకి కంపెనీ రీ-ఎంట్రీని గుర్తుచేస్తూ, పూర్తి సరికొత్త టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్ ఆధునిక స్టైలింగ్, అత్యాధునిక ఫీచర్లు సాంకేతికతలను కలిగి ఉందని టీకేఎం ప్రతినిధి చెప్పారు.పూర్తి సరికొత్త అర్బన్ క్రూయిజర్ టైజర్ 1.0 లీ టర్బో, 1.2 లీ పెట్రోల్ ఈ - సీ ఎన్ జీ ఎంపికలలో అందుబాటులో ఉందన్నారు. 1.0 టర్బో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మరియు 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో అందుబాటులో ఉందన్నారు. తద్వారా పవర్ పెర్ఫార్మెన్స్ ప్రాధాన్యతలు రెండింటికీ ప్రాధాన్యత ఇచ్చే కస్టమర్‌లకు వైవిధ్యమైన ఎంపికను అందిస్తుంది. 1.2 లీ పెట్రోల్ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మరియు ఇంటెలిజెంట్ గేర్ షిఫ్ట్ (ఐ జీ ఎస్)లో వస్తుంది. 1.2 లీ ఈ- సీ ఎన్ జీ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌లో లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన టొయోటా కిర్లోస్కర్ మోటర్ యొక్క ఎండి టొయోటా మోటర్ కార్పొరేషన్ (టీ ఎం సీ రీజినల్ హెడ్ మసకాజు యోషిమురా మాట్లాడుతూ, " భారతీయ మార్కెట్ ఎల్లప్పుడూ తమకు చాలా ముఖ్యమైనదన్నారు. కొత్త ఆవిష్కరణ పై టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ, "పూర్తి సరికొత్త అర్బన్ క్రూయిజర్ టైజర్ పవర్ ప్యాక్డ్ పనితీరు, అత్యుత్తమ శ్రేణి ఇంధన సామర్థ్యం మరియు అద్భుతమైన బాహ్య రూపాన్ని మిళితం చేసిందన్నారు. 6 ఎయిర్‌బ్యాగ్‌లతో కూడిన భద్రతా ఫీచర్లు, హిల్ హోల్డ్ అసిస్ట్‌తో వెహికల్ స్టెబిలిటీ కంట్రోల్ %ఉ% ఇతర అధునాతన ఫీచర్‌లతో పాటు రోల్ ఓవర్ మిటిగేషన్ సురక్షితమైన డ్రైవింగ్ అనుభవాన్ని నిర్ధారిస్తాయి" అని అన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో జగ్గిరెడ్డి



విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో నార్కేడ్‌మిల్లి గ్రామంలోని శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి (కనక దుర్గ) అమ్మవారి ఆల యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కొత్తపేట నియో జకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాలా చిన్న వెంకట రమణ, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ యడ్ల శివరామకృష్ణ, శెట్టిబలిజ సంఘ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపిన వాసిరెడ్డి



విశాలాంధ్ర - కాకినాడ : రామ చంద్ర పురం ఎన్నికల పర్యటనలో భాగంగా విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడును టీడీపీ కాకినాడ రూరల్ నాయకులు టీడీపీ రాష్ట్ర కార్య దర్శి వాసిరెడ్డి ఏసుదాసు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వాసిరెడ్డి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్రకార్యదర్శిగా పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మ సాయి స్వచ్ఛంద సేవా సంస్థ చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పెద్దాడ రాజబాబు సహాయంతో బాటసారుల దహార్తిని తీర్చేందుకు మజ్జిగను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, హ్యూమన్ రైట్స్ పల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

24 మంది వలంటీర్ల రాజీనామా

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామ వలంటీర్లు 24 మంది రాజీనామా చేశారు అని ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్ అన్నారు. దీనిపై ఎంపిడిఓ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో బొబ్బిల్లక గ్రామ పంచాయితీ పరిధిలో ఏప్రిల్ 4 గురువారం 24 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారని అన్నారు. ఈ వాలంటీర్లలు అందరూ కూడా తమ వ్యక్తి గత కారణాల వల్ల తమ విధులు నుండి వైదొలిగుతున్నట్లు రాజీనామాల పత్రాలను సమర్పించారని అన్నారు. అలగే మొత్తం 26 మందిలో ఇద్దరు మాత్రం ఎన్నికల కోడ్ రాకముందే రాజీనామాలు చేశారని అన్నారు.

పింఛన్ పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర - నల్లజర్ల : కవులూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో పెన్షన్ పంపిణీ చేశారు. పెన్షన్ తీసుకోవడానికి ఇంటికి వెళ్లి ఇచ్చింది లేదు కనుక పంచాయతీ, సచివాలయం నందు పడిగాపులు కాసిన పెన్షన్ దారులు పెన్షన్ తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు అవ్వ తాతలు ఎండ వేడిమికి తట్టుకోలేక ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఎంతో ఇబ్బంది పడ్డారు. ఎంత ఇబ్బంది ఈ ఐదు సంవత్సరాలలో జగన్ పాలనలో మేము పడలేదని వాలంటీర్లు మేము లేవకుండానే తలుపు తట్టి మరి ఇచ్చేవారని, అట్లాంటి వాలంటీర్లను దూరం చేసి మాకు ఇంత దయనీయస్థితిని తీసుకువచ్చిన ఘనత బాబు గారిదేనని ఇప్పుడే ఇలా మండుటెండలో ఈ పండు టాకులను ఎండబెడుతున్నాడు అంటే రానున్న దినాల్లో ఒకవేళ అధికారంలోకి వస్తే ఇంకెంత ఇబ్బంది పెడతాడో ఈ పండు టాకుల్ని అని వారు మీడియా ఎదుట వాపోయారు. ఎంతటి పరిస్థితికి దిగజారిన తత్వాన్ని బట్టి ప్రజానీకం అందరు కూడా ఇంత దిగజారుడు రాజకీయాలు చేయకూడదని ఆంటీ వృద్ధులను జ్ఞాపకం ముంచుకుని ఆలోచించాలని ప్రజానీకం మీడియా ఎదుట తెలియజేశారు. ఎండ వేడిమికి తట్టుకోలేక గాలి లేకపోవడం వల్ల ప్రజలందరూ కూడా సచివాలయాలు చుట్టూ పంచాయతీల చుట్టూ తిరుగుతూ అలసిపోయారు

రేపటి నుంచి వార్షిక పరీక్షలు

విశాలాంధ్ర - మండపేట : ఒకటో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈ నెల 6 శనివారం నుండి నిర్వహిస్తున్నామని మండపేట విద్యాశాఖ అధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. 2024 (ఎస్ ఎ 2) పరీక్షలు శనివారం నుండి ఈ నెల 19 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 9 గంటలకి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులకు 9 గంటల నుంచి 12.15 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

ఆదిత్య జాతీయ స్థాయి "ప్రో-కార్ట్ రేసింగ్" సీజన్-4 విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ది.01-4-2024 నుండి ది.04-4-2024 వరకు నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి "ప్రో-కార్టింగ్ ఎండు రెన్స్ ఛాంపియన్ షిప్-2024 " సీజన్-4 పోటీలలో మహారాష్ట్రకు చెందిన పివిడిపి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ట్రోజన్) కళాశాల విద్యార్థులు అత్యధిక పాయింట్లుతో విజేతగా నిలిచారు. విశాఖపట్నానికి చెందిన రఘు ఇంజనీరింగ్ కళాశాల (ఎనిగ్మా టీమ్) రన్నర్ అప్‌గా నిలిచింది. గురువారం జరిగిన ఎండు రెన్స్ పోటీలను విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డా ఎం శ్రీనివాస రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ఉన్న కళాశాలలకు చెందిన విద్యార్థులే కాకుండా మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌లకు సంబంధించిన 350 మంది సభ్యులు పాల్గొన్న ప్రో కార్ట్ రేసింగ్‌లో ఎండు రెన్స్ విభాగంలో జరిగిన పోటీలు విద్యార్థుల కేరింతల మధ్య ఎంతో ఉత్కంఠ భరితంగా సాగాయి. కోకో.కోలా కంపెనీ, మరియు అల్టాయిర్, ఫ్లై మాస్టర్ కంపెనీల సంయుక్త సౌజన్యంతో విజేతలకు ఓవరాల్ ఈవెంట్ విన్నర్ మహారాష్ట్రకు చెందిన పివిడిపి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ట్రోజన్) టీమ్ కు రూ.100000/-లు నగదు బహుమతి, రఘు ఇంజనీరింగ్ కళాశాల (ఎనిగ్మా టీమ్) రన్నరప్‌కు రూ.50,000/-లు, ఇవే టీములు ఎండు రెన్స్ విన్నర్ పివిడిపి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మహారాష్ట్ర), రూ.85,000/-లు, ఎండు రెన్స్ రన్నర్ రఘు ఇంజనీరింగ్ కళాశాల రూ.50,000/-లు గెలుపొందాయి. అలాగే వివిధ అంశాలలలో పాయింట్ల ఆధారంగా నగదు బహుమతులతో పాటుగా జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలు అందజేసారు. మొత్తం రూ.4,00,000/-ల నగదు బహుమతులు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి, కోకో కోలా, అల్టాయిర్, ఫ్లై మాస్టర్ కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా అందించారు.

వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం



విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వేలాదిక భక్తులు తరలివస్తున్నారు. ఏడు వారాల వెంకన్న దేవుడు దర్శించుకుంటే ఏడేడు జన్మల పుణ్యఫలంతో కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం, కోనసీమ తిరుమల శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవములు సందర్భంగా జరిగిన పందిరి రాట సుముహూర్త కార్యక్రమము. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి శ్రీ భూపతి రాజు కిషోర్ కుమార్, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గడపగడపకు వైసీపీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వాకపల్లి చింతలూరు గ్రామాల్లో గురువారం గడప గడపకు వైసీపీ ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ అనంతబాబు, కాకినాడ పార్లమెంటు వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ హాజరయ్యారు. ప్రత్తి పాడు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీకే సుధాకర్, జడ్పిటీసి రాజేశ్వరి దొర బాబు, వైసీపీ మండల కన్వీనర్ రామిశెట్టి నాని, నాయకులు పాల్గొన్నారు.

వరుపుల సుబ్బారావును ఆశీర్వదించండి

విశాలాంధ్ర - అన్నవరం : ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావును ఆశీర్వదించాలని కోరుతూ భార్య వరుపుల వెంకట లక్ష్మీ అన్నవరం గ్రామంలో 1,2 వార్డులలో గడప గడపకు వెళ్లి ప్రజలను అభ్యర్థించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఒక ఓటు తన భర్తకు, రెండో ఓటు కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు. అంతకు ముందు తొలిపావంచాల వద్ద సత్యన్నారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రచారం ప్రారంభించారు. ప్రత్తిపాడు జెడ్‌పిటీసి బెహరా రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ దదాల సతీష్, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, బలుపు రాంబాబు, కొండపల్లి అప్పారావు, వార్డు సభ్యులు సింగంపల్లి రాము, తాటిపాక కృష్ణ, బాబురావు, సూరిబాబు, గొర్ల బుజ్జి పాల్గొన్నారు.

సఖ్యత కుదిరింది

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఒకే పార్టీలో సంవత్సర కాలంగా ఎడ ముఖం, పెడముఖంగా ఉన్న నేతలు చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒకటయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్ల గల ఏలేశ్వరం నగర పంచాయతీ సీనియర్ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ వర్గాన్ని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పటి వరకు జిల్లా రాష్ట్రస్థాయి నేతలు సైతం పైలా బోస్‌ను కలుపుకోవాలని సూచించిన సత్యప్రభ సున్నితంగా తిరస్కరించారు. ఎట్టకేలకు గురువారం జిల్లా పర్యటనలో ఉన్న పార్టీ అధినేత చంద్రబాబు చొరవతో వారు ఇద్దరు ఒకటయ్యారు.

సరిపల్లిలో విశ్వరూప్ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారంహోరెత్తిపోతోంది. వైకాపా అభ్యర్థి రాష్ట్ర మంత్రి గురువారం సరిపల్లి లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్ల గురించి చంద్ర బాబు ఎన్నికల కమిషన్ కి పిర్యాదు చేసి వృద్ధుల నోటికాడ అన్నం తీసేసారని విమర్శించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జడ్పిటిసిలు గెద్దం సంపదరావు, పందిరి శ్రీహరి, సరేళ్ల రామకృష్ణ, నక్కా చంద్ర శేఖర్, నక్కా సంపత్, ఉండ్రు వెంకటేష్, మంగళంపల్లి అంజిబాబు,ప్రదీప్ తదితరులున్నారు.

వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేఖం కాదు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే టీడీపీ వ్యతిరేకమని, అయితే నిజాయితీ కలిగిన వలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. వాలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైఎస్సార్సీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేయాలని, పూర్తిస్థాయి ఉద్యోగులు కాని వాలంటీర్లను కాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు.పేదలు, వృద్ధులు, వికలాంగుల పింఛన్లతో జగన్ రెడ్డి కొత్త డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలను దూషించేందుకే వైఎస్సార్సీపీ పింఛన్ల పంపిణీని నిలిపివేసిందని మండిపడ్డారు. ఏపీలో రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును టీడీపీ 72 శాతం పూర్తి చేసిందని, టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2020 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మూడు పంటలకు నీరు అందించేదన్నారు. వివేకా హత్య, కోడి కత్తి డ్రామాలు ఆడి సానుభూతితో అధికారంలోకి జగన్ రెడ్డి వచ్చారని, ఇప్పుడు వృద్ధులను చంపి టీడీపీని బ్లేమ్ చేస్తున్నారని ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిబద్ధతతో జీవితాన్ని గడిపిన బహు ముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు అని తూర్పు గోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గౌరవ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన తూ.గో.జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రథమ వార్షికోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు పడాల రామారావు 18వ స్మారకోత్సవ సభకు డాక్టర్ రామారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ స్వాతంత్రో ద్యమంలో ప్రముఖ పాత్ర వహించి, కార్మికుల కోసం, పీడిత ప్రజల కోసం పోరాటాలు సాగించి, సమాజ మార్పు కోసం కలంపట్టి శతాధిక గ్రంథాలు రచించిన పడాల రామారావు చిర స్మరణీయుడని డాక్టర్ రామారెడ్డి కొనియాడారు. తూ.గో.జిల్లా అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు స్వాగతం పలికారు. నన్నయ విశ్వ విద్యాలయ తెలుగు శాఖ అధిపతి డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పడాల రామారావు వ్రాసిన అనేక గ్రంథాలను ప్రస్తుతించారు. పడాల సమాజానికి ఎన్నో సేవలు చేశారని, రచయిత అంటే సామాజిక బాధ్యత కలిగిన వాడని నిరూపించారని చెప్పారు. ఎస్.కె.వి.టి.కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ పి.వి.సంజీవరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఇద్దరే ఇద్దరు వ్యక్తులు శతాధిక గ్రంథాలు రాశారని సమాజానికి ఉపయోగపడి సంఘ సంస్కరణ ఉద్యమంలో పాలుపంచుకున్నారని, ఆ ఇద్దరిలో పడాల రామారావు ఒకరిని తెలి పారు. రాష్ట్ర అరసం కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్ మాట్లాడుతూ పడాల రామారావు రచయితగా, కార్మికవర్గ నేతగా, చరిత్ర పరిశోధకులుగా, బహుముఖ ప్రజ్ఞను తమ స్వంతం చేసుకున్నారన్నారు. సమకాలీన పరిస్థితుల్లో వివిధ మాధ్య మాల ద్వారా అబద్దాలను పుంఖానుపుంఖాలుగా వదిలి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎండగట్టి పడాల రామారావు చారిత్రక పరిశోధక రచనలను భావితరాలకు అందజేశారన్నారు. పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గురించి ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి పడాల రామారావు అని, సినీ నటుడు కృష్ణ కూడా పడాల వారిని అడిగే అన్ని విషయాలు తెలుసుకుని సినిమా నిర్మించి విజయవంతం చేశారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ పడాల వారితో తనకి సాన్నిహిత్య అనుబంధం ఉన్నదని ఎన్నో కార్యక్రమాలు ఇద్దరం కలిసి గంటల తరబడి చర్చించామని, సాహిత్య విషయంలోనూ సంఘ సంస్కరణలోనూ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ ఆయన ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ పడాల వారు సాహిత్యానికి చేసిన కృషి ఎంతో గొప్పదని చెప్పారు. ఆదిత్య తెలుగు లెక్చరర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ పడాల రామారావు రాజమండ్రిని రాజమహేంద్రవరంగా మార్చాలని పోరాటం చేశారని ఈ సందర్భంగా కంఠంరెడ్డి సోమశేఖర్, ఉప్పుగంటి రాజశ్రీ, ఆదారి నాగ సత్యనారాయణ, పూటుకూరి సుబ్రమణ్యేశ్వరస్వామి, ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి, కౌలూరి ప్రసాదరావు, షేక్ మీరా, గండి స్వామి ప్రసాదుకు పడాల రామారావు స్మారక పురస్కారాలను అందజేశారు. అరసం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి, ఎస్.పి.గంగిరెడ్డి, అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు ధర్నాలకోట వెంకటేశ్వరరావు రాజమండ్రి బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన సందర్భంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెమొగ్గల గోపాలరావు, బూడిద వీర్రాజు, మాదేటి రవి ప్రకాష్, లోలభట్టు శ్రీనివాసరాజు, అల్లాడ శ్యామలాదేవి, బొమ్మను మాధురి పాల్గొన్నారు.